సాక్షి
అనకాపల్లి
మంగళవారం । 21 । మే । 2024



పుష్పయాగం

పెందుర్తి: వెంకటాద్రిపై వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆఖరి రోజు సోమవారం పుష్పయాగం ఘనంగా చేశారు.



స్వచ్ఛమైన పాల వెల్లువ

8లో

ప్రస్తుతం కల్తీ లేని ఉత్పత్తులు దొరకడం గగనంగా మారింది. ముఖ్యంగా పాల విషయంలో ప్రజలకు చాలా అనుమానాలు ఉన్నాయి.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
36.0/26.0

తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు. ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ చేసిన ఆర్జేడీ



మంగళాపురంలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్జేడీ చిన్మయి దేవి

బుచ్చెయ్యపేట: మండలంలోని మంగళాపురం, కుముదాంపేట తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆర్జేడీ జి.చిన్మయి దేవి సోమవారం తనిఖీ చేశారు. పిల్లలను లెక్కించి హాజరు పట్టికలను పరిశీలించారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం నాణ్యత ఎలా ఉందో చూశారు. సంపూర్ణ పోషణ కిట్లు, ఇతర ఆహార పదార్థాలు బాగానే అందుతున్నాయని పలువురు తెలపడంతో ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది రాధాలక్ష్మి, పార్వతీదేవి, అరుణ తదితర్లు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తప్పనిసరి

నర్సీపట్నం: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో చేరేందుకు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు దగ్గరలో ఉన్న ఐటీఐలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ విధిగా చేయించుకోవాలని ఐటీఐల జిల్లా కన్వీనర్, స్థానిక ఐటీఐ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసాచారి పేర్కొన్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ విషయంలో విద్యార్థులు అలసత్వం వహిస్తే సీట్లు కోల్పోతారన్నారు. జూన్ 10వ తేదీలోగా వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు తమ రిజిస్ట్రేషన్ ఐడీ స్లిప్ ప్రింట్ తీసుకొని అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో దగ్గరలోని ఏ ప్రభుత్వ ఐటీఐలోనైనా తప్పనిసరిగా వెరిఫికేషన్ చేయించుకొని, ప్రిన్సిపాల్ అప్రూవల్ పొందాలన్నారు. మెరిట్ లిస్టులో డిటైల్స్ లేని అభ్యర్థులను కౌన్సెలింగ్‌కు అనుమతించబోమన్నారు.

24న ఎంఎస్‌ఎంఈ వర్క్‌షాప్

గోపాలపట్నం (విశాఖ): ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఈ నెల 24న ఎంఎస్‌ఎంఈ మేక్ ఇన్ ఇండియా సపోర్టు స్టార్టప్ అండ్ అగ్రిటెక్, ఆక్వా, ఫుడ్ ప్రాసెసింగ్ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్టు ఎంఎస్‌ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ డాక్టర్ దాసరి దేవరాజ్, డీజీఎస్ సంతోష్‌కుమార్ సోమవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పెందుర్తి మహిళా ప్రగతి కేంద్రం టీటీడీసీలో ఈ వర్క్‌షాప్ జరుగుతుందని పేర్కొన్నారు. సపోర్టింగ్ హ్యాండ్ హోల్డింగ్ గైడెన్స్, రూ.5 కోట్ల వరకూ రుణ సదుపాయం పొందడంపై అవగాహన కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 23వ తేదీలోగా పెందుర్తి ఎంఎస్‌ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. పూర్తి వివరాలకు 98667 93111, 99630 45222 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఏయూలో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల పరిధిలో ఎమ్మెస్సీ ఫిజిక్స్, ఎమ్మెస్సీ హోమ్ సైన్స్, ఎమ్మెస్సీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఎమ్మెస్సీ న్యూక్లియర్ ఫిజిక్స్ మెదటి సంవత్సరం, మెదటి సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సోమవారం విడుదల చేశారు. ఫిబ్రవరి నెలలో జరిగిన పరీక్షల ఫలితాలను విడుదల చేసి వెబ్‌సైట్‌లో ఉంచారు.

- ఆర్ట్స్ కళాశాల పరిధిలోని జర్మన్, ఫ్రెంచ్, ఫోటో గ్రఫీ డిప్లమా కోర్సుల పరీక్షల ఫలితాలు విడుదల చేశారు.
- ఇంజనీరింగ్ కళాశాల పరిధిలో బీటెక్ ఆరో సెమిస్టర్, రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేశారు.

నేడు మోదకొండమ్మ కొలువు సంబరం

మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ నెల రోజుల పండగ సందర్భంగా మంగళవారం కొలువు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం అమ్మవారి ఘటాలను శుభ్రపరచి సిద్ధం చేశారు. అమ్మవారికి వడ కులస్తులు తొలిపూజలు నిర్వహించే సంప్రదాయం పూర్వం నుంచి కొనసాగుతోందని కమిటీ సభ్యులు చెప్పారు. మంగళవారం ఉదయం ఆలయం నుంచి అమ్మవారి ప్రతిరూపమైన ఘటాలను ఆలయ కమిటీ సభ్యులతోపాటు భక్తులు శిరస్సున పెట్టుకుని, మంగళవాయిద్యాలు, డప్పులు, కోలాటాల నడుమ మహరాజుల కోట బయట ఉన్న సతకం పట్టు వద్దకు తీసుకొస్తారు. అక్కడ అమ్మవారి కొలువు ఏర్పాటు చేస్తారు. నెల రోజులపాటు అమ్మవారు భక్తులకు అక్కడే దర్శనమిస్తారు.

భద్రత వెరీ స్ట్రాంగ్

- జిల్లాలో 24 గంటలూ పటిష్టమైన పోలీస్ నిఘా
- జూన్ 4న ఎన్నికల ఫలితాల నేపథ్యంలో భద్రత పెంపు
- గ్రామాల్లో 144 సెక్షన్ అమలు.. రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా
- గ్రామాల్లో గొడవలు జరగకుండా పోలీస్ ముందస్తు చర్యలు
- స్ట్రాంగ్ రూమ్‌లను సందర్శించిన డీఐజీ, జిల్లా ఎస్పీ



గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు చెలరేగకుండా ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న పోలీసు అధికారులు



స్ట్రాంగ్ రూమ్ వద్ద సీసీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్న డీఐజీ విశాల్ గున్ని, ఎస్పీ మురళీకృష్ణ

సాక్షి, అనకాపల్లి: పోలింగ్ ముగిసి వారం రోజులైంది. కౌంటింగ్‌కు మరో రెండు వారాల సమయం ఉంది. లెక్కింపు ఘడియలు దగ్గరయ్యే కొద్దీ సర్వత్రా ఉద్రిక్త వాతావరణం నెలకొనే అవకాశముంది. ఈ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా పటిష్టమైన పోలీస్ నిఘా ఏర్పాటు చేశారు. జూన్ 1న ఎగ్జిట్ పోల్స్, జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుంది. ఎన్నికల ఫలితాలకు ముందు గానీ, తరువాత గానీ గ్రామాల్లో విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, స్టేజ్ ప్రోగ్రాంలకు ఎటువంటి అనుమతుల్లేవని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలను రెచ్చగొట్టేలా రాజకీయ నాయకుల సందేశాలు, నిరాధార ఆరోపణలు, రచ్చబండ చర్చలు, సామాజిక, సోషల్ మీడియాల్లో ప్రచారం.. మొదలైన వాటిని నేరంగా పరిగణిస్తున్నట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు. పెట్రోల్ బంకుల్లో లూజ్ పెట్రోల్ అమ్మకాలు, బాణసంచా విక్రయాలపై ఆంక్షలు విధించారు. ధాబాల్లో, హోటళ్లలో, పాన్‌షాప్‌లలో అక్రమ మద్యం, సారాయి అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నారు. జూదం, కోడిపందాలు, కాయిన్ గేమ్, బెట్టింగ్ మొదలైన చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో నాటుసారా, అక్రమ మద్యం, రవాణా జరగకుండా ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. లాడ్జీలు, సత్రాలు, కల్యాణ మండపం మొదలైన చోట అపరిచిత వ్యక్తులు, అనుమానిత వ్యక్తులను ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకుంటున్నారు.

గ్రామాల్లో ఇరు పార్టీల వారితో సమావేశం

ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌హెచ్‌ఓ స్థాయి పోలీస్ అధికారులు గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీ నాయకులు, వివిధ వర్గాల ప్రజలతో సమావేశాలు నిర్వహించి మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, కౌంటింగ్ ఫలితాల సమయంలో కోడ్ ఉల్లంఘనకు పాల్పడితే తీసుకునే కఠిన చర్యలను వివరిస్తున్నారు. గ్రామాల్లో పోలీసు పికెట్, పెట్రోలింగ్, చెక్ పోస్టులను ప్రణాళికబద్ధంగా ఏర్పాటు చేస్తారు. అసాంఘిక కార్యక్రమాలను ప్రోత్సహించేవారు, ప్రజలను ఇబ్బంది పెట్టేవారిని గుర్తించి, వారి కట్టడికి ముందస్తుగా బైండోవర్ చేస్తున్నారు. గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్‌లు, అనుమానాస్పద గ్రామాల్లో కార్డన్, సెర్చ్ ఆపరేషన్‌లు చేపడున్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు.

కేంద్ర బలగాలు, ఆర్మ్‌డ్ రిజర్వు, సివిల్ పోలీసులను ఏర్పాటు చేశారు. 24 గంటలూ నిరంతర సీసీ కెమెరాల నిఘా.. ప్రత్యేక సాయుధ బలగాల పహారా ఏర్పాట్లు ఉన్నాయి.

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా

పాత నేరస్తులు, రౌడీ షీటర్ల పై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ముందస్తుగా పోలీస్‌స్టేషన్ల వద్ద కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. వారిలో ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పీడీయాక్ట్‌తో పాటు జిల్లా నుంచి బహిష్కరించనున్నట్లు ఎస్పీ మురళీకృష్ణ హెచ్చరించారు. 2014, 2019 సార్వత్రిక ఎన్నికలు, 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో నేరాలకు, తగాదాలకు పాల్పడినవారిపై నిఘా ఉంచారు. అభ్యర్థుల గెలుపు, ఓటములపై బెట్టింగ్‌లు నిర్వహించేవారు.. పాల్గొనేవారిపై కఠిన చర్యలు తీసుకుంటారు.

స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన డీఐజీ

ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనల మేరకు జిల్లా ప్రజలు అధికార యంత్రాంగానికి తమ వంతు సహకారం అందించాలని విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని కోరారు. జిల్లా ఎస్పీ మురళీకృష్ణతో పాటు ఆయన కలెక్టరేట్ సమీపంలో గల ఫ్యూచర్ వరల్డ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంలు, వీవీప్యాట్‌లను, కంట్రోల్ యూనిట్‌లను పరిశీలించారు. కౌంటింగ్‌కి ముందుగానీ, కౌంటింగ్ రోజు గాని, కౌంటింగ్ తర్వాత గాని ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ఠ భద్రత చర్యలు తీసుకుంటున్నామని, కౌంటింగ్ రోజు 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించబోమని, అల్లర్లలో పాల్గొనే వారి వాహనాలు సైతం సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రజలందరూ సంయమనంతో వ్యవహరిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖకు సహకరించాలని డీఐజీ సూచించారు.

వైభవుడికి లక్ష మల్లెలతో అర్చన



లక్ష మల్లెలతో పూజలు అందుకున్న వైభవ వేంకటేశ్వరస్వామి



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మురళీనగర్ (విశాఖ): కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 22వ వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం లక్ష మల్లెల అర్చన నిర్వహించారు. ఉదయం 5గంటలకు వైభవుడికి సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, బాలభోగం, మంగళశాసనం, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రుత్విక్‌గ్వరుణ నిర్వహించారు. అనంతరం 9గంటలకు లక్ష మల్లెలతో అర్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. సాయంత్ర 5గంటలకు సదస్యోత్సవం నిర్వహించారు.

ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. మంగళవారం ఉదయం 9గంటలకు శ్రీవారికి చక్రస్నానం, వసంతోత్సవం, సాయంత్రం 6గంటలకు ఊంజల్ సేవ నిర్వహిస్తారు. 22న ఉదయం తిరువీధి మహోత్సవం, 23న ఉదయం 6గంటలకు వైభవుడికి పౌర్ణమి పంచామృతాభిషేకం అనంతరం సర్వాంగ వజ్రకవచంతో శ్రీవారి దర్శనం, 25న మధ్యాహ్నం నారాయణ సేవ నిర్వహిస్తారు.

ఒలింపిక్స్ దిశగా జ్యోతి పరుగు



భారత్ హార్డిలర్ జ్యోతి

విశాఖ స్పోర్ట్స్ : భారత హార్డిలర్ జ్యోతి ఎర్రాజీ అంతర్జాతీయ మీట్‌లో మరో స్వర్ణాన్ని సొంతం చేసుకుంది. ఒలింపిక్స్‌కు అర్హత సాధించే దిశగా సాగుతున్న ఆమే ప్రయాణంలో ఈ స్వర్ణం దోహదపడనుంది. ఒలింపిక్స్‌లో అర్హత సాధించేందుకు వచ్చే 30వ తేదీలోగా మరో ఐదు అంతర్జాతీయ పోటీల్లో రాణించాల్సి ఉంది. విశాఖ నుంచి అంతర్జాతీయ స్థాయి అథ్లెట్స్‌గా భారత్ తరపున నెదర్లాండ్స్‌లోని కుర్ఫాల్ట్ గాలాలో జరిగిన వంద మీటర్ల హార్డిల్స్‌ను 13.06 సెకన్లలోనే పూర్తి చేసి విజేతగా నిలిచి స్వర్ణాన్ని అందుకుంది. ఈనెల ప్రారంభంలోనే జరిగిన హారీ షుల్టింగ్ గేమ్స్‌లో విజయం సాధించిన తర్వాత మహిళల వంద మీటర్ల హార్డిల్స్‌లో ఈ మార్క్‌కి ఈ సంవత్సరంలో రెండో టైటిల్. ఈ ఈవెంట్‌లో 200 మీటర్ల టైమ్ ట్రయల్స్ ఫైనల్‌లోనూ పోటీ పడి ఇద్దరు డచ్ అథ్లెట్స్ వెనుక 23.83 సెకన్ల సమయంలో పూర్తి చేసి మూడవ స్థానంలో నిలిచింది.

అప్పన్న దాసుడొచ్చాడు

- సింహగిరికి వచ్చిన లక్ష్మీకాంత్ నాయక్‌దాస్
- మూడు నెలలపాటు విడిది



కొండదిగువ తొలిపావంచా స్వామికి పూజలు నిర్వహిస్తున్న లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్

సింహాచలం : ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్ నాయక్‌దాస్ సోమవారం సింహగిరికి వచ్చారు. మూడు నెలలపాటు సింహగిరిపై ఉండి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సేవలందించను న్నారు. తన పరివారంతో సింహాచలం చేరుకున్న దాసుడు తొలుత కొండదిగువ తొలిపావంచా వద్ద శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి పూజలు నిర్వహించారు. ఆ తర్వాత సింహగిరికి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు తులసి ప్రసాదాన్ని అందజేశారు. తదుపరి సింహగిరిపై ఉన్న దాసుల సత్రానికి తరలివెళ్లారు.

ఇదీ దాసుడి చరిత్ర

ఒడిశాలోని పట్టుపురానికి చెందిన దాసుల కుటుంబం తరతరాలుగా సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సేవలో తరిస్తోంది. ఏటా వైశాఖ మాసం నుంచి మొదులుకొని సుమారు మూడు నెలలపాటు వీరు సింహగిరిపై ఉండి స్వామిని సేవించడం పరిపాటి. ఈ మూడునెలల్లో వీరి ఆధ్వర్యంలో ఒడిశా రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు సింహగిరికి తరలివచ్చి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుంటారు. ఈ మూడు నెలల్లో దాసుడు స్వామికి ఆర్జిత సేవలను విశేషంగా జరిపిస్తారు. లక్ష కుంకుమ పూజ, లక్ష తులసి పూజ, గరుడ సేవ, కోలాటసేవ, నిత్య కల్యాణం, పుష్పాంజలి సేవలను ఘనంగా జరిపిస్తాడు. ఈసేవల్లో పాల్గొనేందుకు అధిక సంఖ్యలో ఒడిశా భక్తులు ఆయారోజుల్లో సింహగిరికి తరలివస్తారు. ఈ మూడు నెలలు వీరి రాకతో సింహగిరిపై సందడి నెలకుంటుంది. సింహగిరి నుంచి దాసుడు తిరుగు ప్రయాణమయ్యే రోజు నగదును మూటలుగా కట్టి ఆలయంలోని హుండీల్లో వేయడం పరిపాటి. ఈ నగదంతా పట్టుపురంలోని దాసుడి ఇంట్లో ఏర్పాటు చేసిన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో అక్కడ భక్తులు సమర్పించినదే కావడం విశేషం. తన తండ్రి వనమాలికో దాస్ మరణానంతరం 2008 నుంచి లక్ష్మీకాంత్‌నాయకోదాస్ శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సేవలందించే బాధ్యతలు స్వీకరించారు. దాసుడు బస చేసేందుకు సత్రం కూడా సింహగిరిపై ఉంది.

కార్గో సేవలు మరింత విస్తృతం

- పాఠ్య పుస్తకాలు, విత్తనాలు సైతం.. ఆర్టీసీ లాజిస్టిక్స్ బస్సుల ద్వారా రవాణా
- జూన్ తొలి వారానికి ముందే పుస్తకాల పంపిణీ
- జూన్ ఆఖరి వరకు విత్తనాల సరఫరాకు సన్నాహాలు
- రూ.కోటి ఆదాయం సమకూరుతుందని అంచనా



ఆర్టీసీ లాజిస్టిక్స్ వాహనంలోకి పుస్తకాలు లోడ్ చేస్తున్న సిబ్బంది

సాక్షి, విశాఖపట్నం: ఒకపక్క పాఠశాలలు తెరుచుకునే సమయం ఆసన్నమవుతోంది. మరోపక్క ఖరీఫ్ సీజను సమీపిస్తోంది. వీటిని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ కార్గో సేవలకు సిద్ధమవుతోంది. గతంలో ప్రైవేటు సంస్థలు, వాహనాల ద్వారా వీటి సరఫరా జరిగేది. ఆర్టీసీకి ఆదాయాన్ని పెంచే ఉద్దేశంతో గతేడాది నుంచి ప్రభుత్వం వీటి సరఫరాను కార్గో విభాగానికి అప్పగించింది. ఈ ఏడాది కూడా ఆర్టీసీ ఆ బాధ్యతలో పాలు పంచుకుంటోంది. తాజాగా ఆ ప్రక్రియను చేపట్టింది. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల ఆర్టీసీ జోన్–1 పరిధిలో 38 డిపో గూడ్స్ ట్రాన్స్‌పోర్టు (డీజీటీ–లాజిస్టిక్స్) వాహనాలు ఉన్నాయి. ఇప్పుడు వీటి ద్వారా బడి పిల్లలకు అవసరమయ్యే పాఠ్య, నోట్ పుస్తకాల సరఫరాకు శ్రీకారం చుట్టింది. వీటిని జిల్లా కేంద్రాల నుంచి మండల కేంద్రాలకు లాజిస్టిక్స్ వాహనాల్లో తరలిస్తున్నారు. అక్కడ నుంచి సంబంధిత అధికారులు పాఠశాలలకు చేరవేస్తారు. వాటిని వారు బడి పిల్లలకు పంపిణీ చేస్తారు. ఇలా ఉత్తరాంధ్ర జిల్లాల్లో నెలాఖరు లేదా జూన్ మొదటి వారంలోగా లాజిస్టిక్స్ వాహనాల్లో పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కుల రవాణా ప్రక్రియను పూర్తి చేయనున్నారు. మరోవైపు ఖరీఫ్ సీజను కూడా మరో నెల రోజుల్లో ప్రారంభం కానుంది. దీంతో రైతులకు అవసరమైన విత్తనాలను కూడా ఈ ఆర్టీసీ కార్గో సర్వీసుల ద్వారానే రవాణా చేయనున్నారు. ఏపీ సీడ్స్ సంస్థ ఇప్పటికే అవసరమైన విత్తనాలను సిద్ధం చేసింది. వీటిని జిల్లా కేంద్రాల నుంచి వివిధ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకేల)కు ఆర్టీసీ లాజిస్టిక్స్ వాహనాల్లో తరలించనున్నారు. విత్తనాల తరలింపు కార్యక్రమాన్ని జూన్ నెలాఖరు వరకు చేపట్టనున్నారు.

రూ.కోటి ఆదాయం వచ్చే అవకాశం

గత సంవత్సరం కార్గో విభాగం ద్వారా విత్తనాలు, పాఠ్య పుస్తకాల రవాణా ద్వారా ఆర్టీసీ జోన్–1కు రూ.50 లక్షల ఆదాయం సమకూరింది. ఈ ఏడాది అది రెట్టింపు అంటే రూ.కోటి వరకు వస్తుందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం సరఫరా చేసే పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులతో పాటు రైతులకు అవసరమయ్యే వివిధ రకాల విత్తనాల రవాణా ప్రక్రియను ఆదివారం నుంచి చేపట్టామని ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (ఓఅండ్‌డీ) బి.అప్పలనాయుడు 'సాక్షి'కి చెప్పారు.

ఇంటర్ సప్లిమెంటరీకి సర్వం సిద్ధం

- ఈనెల 24 నుంచి జూన్ 1 వరకు పరీక్షలు
- జిల్లాలో 20 కేంద్రాల్లో నిర్వహణ
- పరీక్షలు రాయనున్న 14,807 మంది విద్యార్థులు



తుమ్మపాల: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్న పరీక్షలను జిల్లావ్యాప్తంగా 20 కేంద్రాల్లో నిర్వహించనున్నారు. జిల్లాలో ఫస్టియర్ 9,326 మంది, సెకండియర్ 5,481 మంది, మొత్తం 14,807 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇప్పటికే సిబ్బందిని నియమించారు. డీవీఈవో, హైపవర్ కమిటీ, సిటింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేస్తున్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు పెట్టి, వీటి ద్వారా ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు పర్యవేక్షించేలా స్ట్రీమింగ్ చేశారు. పరీక్షలు తప్పినవారికి, మరిన్ని మార్కులు పొందేందుకు బెటర్‌మెంట్ కట్టిన విద్యార్థులకు కళాశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

రెండు సెషన్లలో..

ఈనెల 24 నుంచి జూన్ 1 వరకు జరిగే పరీక్షలను రెండు సెషన్లుగా నిర్వహిస్తున్నారు. ఫస్టియర్ విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులు వారికి కేటాయించిన కేంద్రానికి అరగంట ముందుగా చేరుకోవాల్సి ఉంటుంది. ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. అలాగే పరీక్ష కేంద్రాల్లో అవసరమైన వైద్య సిబ్బందిని నియమిస్తున్నారు.

పరీక్ష కేంద్రాలివి..

జిల్లాలో మొత్తం 20 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందులో 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు (పరవాడ, నర్సీపట్నం (గర్ల్స్, బాయ్స్), యలమంచిలి, నక్కపల్లి, పాయకరావుపేట, కొత్తకోట, వడ్డాది, చోడవరం, సబ్బవరం, దేవరాపల్లి, కేడీపేటలలోని ప్రభుత్వ కాలేజీలు, దేవరాపల్లి సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాల, నర్సీపట్నం బాలికల గురుకుల కళాశాల) ఉన్నాయి. 5 ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో (అచ్యుతాపురంలో ప్రశాంతి, పాయకరావుపేట కార్తికేయ, అనకాపల్లిలో నారాయణ, శ్రీచైతన్య, సంయుక్త జూనియర్ కళాశాలలు) కూడా పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇవి కాక ఒక ఎయిడెడ్ జూనియల్ కాలేజీలో (ఆదినారాయణ మహిళా జూనియర్ కళాశాల) కూడా పరీక్షలు నిర్వహిస్తారు.

నేడు కలెక్టర్ సమన్వయ సమావేశం

ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఈ నెల 21న కలెక్టరేట్‌లో సమన్వయ సమావేశం నిర్వహించనున్నారు. ఇందులో ఇంటర్ బోర్డు అధికారులతో పాటు వైద్యఆరోగ్య శాఖ, ఆర్టీసీ, పోలీసు, పోస్టల్, రెవెన్యూ, మున్సిపల్, విద్య, పంచాయతీ శాఖల అధికారులు పాల్గొంటారు. విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలపై చర్చిస్తారు.

ప్రశాంత వాతావరణంలో పరీక్షలు

విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నాం. ముఖ్యంగా మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాం. మండుతున్న ఎండల నేపథ్యంలో విద్యార్థులు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తాం.

–బి.సుజాత,
జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, అనకాపల్లి

పంట పొలాలకు పులుల కాపలా!



ఏంటీ.. ఫొటోను చూసి పంటపొలాల్లో పులులు సంచరిస్తున్నాయని అనుకుంటున్నారా? అదేం లేదు. మండలంలోని 31 పంచాయతీల్లో జీడిమామిడి, జామతోపాటు పలు రకాల కాయగూరలు పండిస్తున్నారు. వీటికి కోతుల బెడద పెరిగింది. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంట కోతుల పాలవుతుంటే రైతులు తట్టుకోగలరా? అధికారుల్ని ఆశ్రయిస్తే పట్టించుకోలేదు. ఏం చేసైనా తమ పంటను కాపాడుకోవాలనుకునే రైతులు దృష్టి పెడితే ఉపాయాలకు కొదవా..? తమ ఆలోచనలకు పదును పెట్టిన కొందరు రైతులు ఎలుగుబంటి వేషాల్లో కోతుల్ని భయపెడుతుంటే.. ఏపీ పురంలో ఓ రైతు తమ పంట పొలాలకు ఏకంగా పులుల్నే కాపలాపెట్టాడు. అవి ఉత్త బొమ్మలే అయినా.. కోతులు మాత్రం దరిదాపుల్లోకి రావట్లేదట! - నాతవరం

స్వచ్ఛమైన పాల వెల్లువ



గిర్ గోవులతో దుర్గారావు



సేంద్రియ విధానంలో పెంచుతున్న గోగ్రాసం

ప్రస్తుతం కల్తీ లేని ఉత్పత్తులు దొరకడం గగనంగా మారింది. ముఖ్యంగా పాల విషయంలో ప్రజలకు చాలా అనుమానాలు ఉన్నాయి. అయినా నగరవాసులకు ప్రైవేట్ డెయిరీల పాల ప్యాకెట్లే దిక్కు. ఇది గ్రహించిన ఓ ముగ్గురు యువకులు కల్తీ లేని స్వచ్ఛమైన పాలు నగర ప్రజలకు అందిస్తే ఎలా ఉంటుందని ఆలోచించారు. వెంటనే రంగంలోకి దిగారు. సేంద్రియ విధానంలో సాగు చేయడం, ప్రజలకు దేశీ గోవు పాలు అందించడం లక్ష్యంగా ముందడుగు వేశారు. రోజూ విశాఖ నగరానికి దేశీ ఆవు పాలను తీసుకువచ్చి ఇంటికే సరఫరా చేస్తున్నారు. గత ఏడు నెలలుగా వారి ప్రయాణం నిర్విరామంగా సాగుతోంది.

– ఏయూ క్యాంపస్

- సేంద్రియ సాగు.. దేశీయ క్షీరం
- విశాఖవాసులకు ఆరోగ్యకరమైన దేశీ పాలు సరఫరా
- డెయిరీ నిర్వహణలో ముగ్గురు యువకుల కొత్త మార్గం
- చోడవరం నుంచి నిత్యం నగరానికి ప్రయాణం

చోడవరం మండలం పొట్టిదొరపాలేనికి చెందిన వియ్యపు దుర్గారావు, పల్ల తాతారావు, దాలిబోయిన దుర్గారావు దేశీ ఆవులను పెంచే దిశగా అడుగులు వేశారు. సేంద్రియ వ్యవసాయంపై అవగాహన, దేశీ గోవులపై అభిమానం కలిగిన ముగ్గురూ హైదరాబాద్ నుంచి మంచి పాలను అందించే సాహివాల్, గిర్ జాతి ఆవులను కొనుగోలు చేసి తీసుకువచ్చారు. వీటితో పాటు మన ప్రాంతంలో లభించే ఒంగోలు, పుంగనూరు జాతి ఆవులను సైతం పెంచుతున్నారు. పాలను ప్రైవేట్ డెయిరీలకు కాకుండా నగరవాసులకు నేరుగా సరఫరా చేస్తే ఫలితం ఉంటుందని భావించారు. అలా నిత్యం విశాఖకు తీసుకువచ్చి సరఫరా చేయడం ప్రారంభించారు. తొలుత 10 లీటర్ల పాలు మాత్రమే విశాఖలో తమకు తెలిసిన వారికి అందించడం ప్రారంభించారు. శ్రీరాధాకృష్ణ గోశాల పేరుతో ప్రస్తుతం 60 కుటుంబాలకు 50 నుంచి 60 లీటర్ల వరకు నిత్యం పాలను సరఫరా చేస్తున్నారు. ఆటోలో పాలను తీసుకువచ్చి నగరంలో వినియోగదారుల ఇంటికే నేరుగా అందిస్తున్నారు. ఇద్దరు యువకులు గోవుల సంరక్షణ, గోగ్రాసం పెంచడంలో నిమగ్నమవుతున్నారు. మరొకరు నిత్యం నగరానికి పాలను తీసుకురావడం దినచర్యగా పెట్టుకున్నారు.

రోజూ 90 కి.మీ. ప్రయాణం

చోడవరం నుంచి నర్సీపట్నం వెళ్లే మార్గంలో ఉన్న పొట్టిదొరపాలెం నుంచి నిత్యం విశాఖకు పాలు సరఫరా చేస్తున్నారు. ఆటోలో నిత్యం 90 కిలోమీటర్లు ప్రయాణిస్తున్నారు. పాలను అర లీటరు చొప్పున ఇంట్లో ప్యాకింగ్ చేసుకుని నగరానికి తీసుకొస్తున్నారు. పాల ధరను సైతం అందరికీ అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. లాభాల కోసం ఆలోచించకుండా ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించడమే లక్ష్యంగా పని చేస్తున్నారు. త్వరలో పూర్తి ప్రకృతి వ్యవసాయ విధానంలో ధాన్యం పండించడం, దాని నుంచి వచ్చే ఎండుగడ్డినే గోవులకు అందించే దిశగా అడుగులు వేస్తున్నారు.

సేంద్రియ పద్ధతిలో పశుగ్రాసం పెంపకం

దేశీ ఆవు పాలను మరింత ఆరోగ్యవంతంగా చేయాలని సంకల్పించారు. దీనిలో భాగంగా పశువులకు అందించే పచ్చిగడ్డిని సైతం సేంద్రియ విధానంలో సాగు చేస్తున్నారు. పశువుల గెత్తం ఎరువుగా వినియోగించి సూపర్ నేపియర్ గడ్డిని నాటారు. పొలంలో పూర్తిగా పశువుల గెత్తం వేసి, రెండు పర్యాయాలు నేలను దున్నిన తరువాత హైదరాబాద్ నుంచి నేపియర్ గడ్డి కణుపులు కొనుగోలు చేసి నాటారు. రెండో కోత వచ్చే సమయానికి ఒక్కో కణుపు నుంచి 30 నుంచి 35 వరకు గడ్డి పిలకలు వచ్చాయి. వీటిపై గోకృపామృతం పిచికారీ చేయడం, గడ్డి పెంచుతున్న సాళ్ల మధ్యలో జీవామృతం పారించడం చేస్తున్నారు. ఇలా పశుగ్రాసాన్ని సైతం ప్రకృతి విధానంలో సాగు చేస్తున్నారు.

ప్రజలకు చేరువ కావాలి..

ప్రజలకు మంచి ఆరోగ్యకరమైన దేశీ ఆవు పాలను అందించడం లక్ష్యంగా పని చేస్తున్నాం. కొంత శ్రమ ఉన్నప్పటికీ, నేలతల్లికి మేలు చేస్తూ, దేశీ గోవుల సంరక్షణ జరుగుతోందనే సంతృప్తితో ముందుకెళ్తున్నాం. ప్రజల నుంచి కూడా స్పందన బాగుంది. మరింత ఎక్కువ మందికి దేశీ ఆవు పాలను అందించాలనే ఆలోచనతో ఉన్నాం. త్వరలో చెక్క గానుగ నూనె సరఫరా కూడా ప్రారంభిస్తాం.

– వియ్యపు దుర్గారావు, రైతు
ఫోన్ : 7993542689

అష్టోత్తర శతనామావళి పరోక్ష సేవకు విశేష స్పందన

సింహాచలం : ఈనెల 10న సింహగిరిపై జరిగిన చందనోత్సవం సందర్భంగా ఆరోజు పరోక్షంగా స్వామికి నిర్వహించిన అష్టోత్తరసేవకు భక్తుల నుంచి విశేషంగా స్పందన లభించింది. మొత్తం 592 మంది భక్తులు రూ.1116 టికెట్లు తీసుకుని పరోక్షంగా అష్టోత్తరపూజను స్వామికి జరిపించారు. వీరందరికీ పోస్టల్ ద్వారా కుంకుమ, చందనం ప్రసాదం, ఆలయ చరిత్ర కరపత్రం, డ్రైఫ్రూట్స్‌ను పంపించే ఏర్పాట్లను సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో అధికారులు చేస్తున్నారు. ఇప్పటికే ప్యాకెట్ల రూపంలో వాటిని సిద్ధం చేస్తున్నారు.



పోస్టల్ ద్వారా భక్తులకు పంపించేందుకు సిద్ధం చేసిన ప్యాకెట్లు

చిరస్మరణీయుడు సిరివెన్నెల



సభలో మాట్లాడుతున్న యర్రంశెట్టి సత్యారావు

అనకాపల్లి: తను రచించిన పాటలతో ప్రేక్షకుల హృదయాలను ఓలలాడించిన సినీ గీత రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి చిరస్మరణీయుడని విశాఖ బీవీకే కళాశాల విశ్రాంత అధ్యాపకుడు యర్రంశెట్టి సత్యారావు కొనియాడారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి విజయ రెసిడెన్సీలో సీతారామశాస్త్రి జయంతి సందర్భంగా సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యారావు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో జన్మించిన సీతారామశాస్త్రి అంచెలంచెలుగా ఎదిగి ఉన్నత శిఖరాలను చేరుకున్నారని తెలిపారు. తెలుగు సినిమా ఉన్నంత వరకు సిరివెన్నెల ప్రజల హృదయాల్లో నిలిచి ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ డీడీ నాయుడు, నాయక్, నాట్యం సినిమా డైరెక్టర్ రేవంత్, పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతో ఆశించిన దిగుబడులు

ఏడీఆర్ డా.పీవీకే జగన్నాథరావు



సమావేశంలో మాట్లాడుతున్న పీవీకె.జగన్నాథరావు

అనకాపల్లి: నాణ్యమైన విత్తనాలతో రాబోవు ఖరీఫ్ సీజన్లో ఆశాజనకమైన దిగుబడులు సాధించవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ పీవీకే జగన్నాథరావు అన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలతో సోమవారం టీ అండ్ వీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మే నెలలో ఇప్పటి వరకు జిల్లాలో 60 శాతం వర్షపాతం నమోదయిందన్నారు. ఈ వర్షాన్ని ఉపయోగించుకుని రైతులు జనుము, జీలుగ, పిల్లి పెసర, పచ్చిరొట్ట పంటలను పెంచి ఖరీఫ్ సాగుకు నేలలో కలియదున్నుట ద్వారా నేల ఆరోగ్యాన్ని పెంపొందించవచ్చన్నారు. దీంతోపాటు ఖరీఫ్‌లో ఆశించిన దిగుబడులను పొందవచ్చన్నారు. జిల్లాలో రైతులకు కావలసిన విత్తనాలు ఆర్ఏఆర్ఎస్‌లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. చెరకు విత్తనాలు(2012ఎ 319, 2010 ఎ 226, 2006ఎ), వరిలో ఆర్‌జేఎల్ 2537, ఎంటీయూ 1318 రకాలు సిద్ధంగా ఉన్నాయన్నారు.

జిల్లా వ్యవసాయశాఖ అధికారి మోహనరావు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలు సాగుకు ఎంతో మేలు చేశాయన్నారు. ఈ నెల 26 నాటికి పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచుతామన్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే ఆర్బీకే సిబ్బంది, వీఏఏలకు వివిధ పంటలు, బయో ఫెర్టిలైజర్స్, విత్తనాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. కేవీకే కొండెంపూడి ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రాజకుమార్ మాట్లాడుతూ ఆర్‌జేఎల్ 2537, ఎంటీయూ 1121 రకాలు, నువ్వులలో వైఎల్ఎం 66, సజ్జలో ఏబీవీ-04, కొర్లలో సూర్యనంద రకాలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో వివిధ మండలాల వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

రేపు సింహగిరిపై నృసింహ హోమం



అప్పన్నస్వామి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రం స్వాతీ నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై బుధవారం శ్రీ నృసింహ హోమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న విశాల ప్రాంగణంలో ఉదయం 7 గంటల నుంచి నృసింహ హోమాన్ని నిర్వహించనున్నారు.నృసింహ హోమంలోపాల్గొనే భక్తులు 2500 టిక్కెట్టుని www.aptemples.ap.gov.inలో తీసుకుని ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ పాల్గొనవచ్చని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. అలాగే సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలో కూడా టికెట్లు లభిస్తాయని తెలిపారు. కాగా బుధవారమే నృసింహ జయంతి కూడా కలిసి రావడంతో ఈసారి నృసింహ హోమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని సంకల్పించారు.

ఇరువర్గాలపై కేసులు నమోదు

అనకాపల్లి: ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు అనకాపల్లి డీఎస్పీ అప్పలరాజు సోమవారం చెప్పారు. డీఎస్పీ కథనం మేరకు వివరాలివి. స్థానిక నర్సింగరావుపేటకు చెందిన ఇంజరపు జయ, పక్కనే ఇంటిలో నివసిస్తున్న ఉరుకుల జ్యోతికి ఆరు సంవత్సరాలు క్రితం రూ. 2లక్షల నగదు అప్పుగా ఇచ్చింది. ప్రతి నెలా వడ్డీ చెల్లిస్తూ వచ్చేది. అయితే ఆరునెలల నుంచి అసలు, వడ్డీ ఇవ్వకపోవడంతో ఈనెల 16 జయ, జ్యోతికి చిన్నపాటి ఘర్షణ జరిగింది. ఈనెల 18 ఇంజరపు జయ, జ్యోతి, జ్యోతి కుమార్తె వీనస్‌లపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదేరోజు వీనస్ కులం పేరుతో దూషించినట్టు జ్యోతి కుమార్తె వీనస్ ఇంజరపు జయ, జయ భర్త ప్రసాద్, ఇద్దరు కుమార్తెలు గాయత్రి, పూర్ణశ్రీలపై ఫిర్యాదు ఇవ్వడంతో, అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ చెప్పారు.

టీచర్ల కృషితోనే పకడ్బందీగా సీబీఎస్ఈ బోధన

పాఠశాల విద్య ఆర్జేడీ విజయభాస్కర్



ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్జేడీ విజయభాస్కర్

కశింకోట: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిష్టాత్మకంగా చేపట్టి, నిర్వహిస్తున్న సీబీఎస్ఈ విధానాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు(ఆర్జేడీ) బి.విజయభాస్కర్ కోరారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని పాఠశాలల్లో సీబీఎస్ఈ కరిక్యులం బోధిస్తున్న ఇంగ్లిష్, బయాలజీ, సోషల్ ఉపాధ్యాయులకు నిర్మాణాత్మక బోధన, పాఠ్య ప్రణాళికపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం మండలంలోని తేగాడ వద్దనున్న ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో సోమవారం ప్రారంభించారు. పాఠ్యాంశాల వారీగా ఉపాధ్యాయులకు చేపట్టిన రెండో విడత శిక్షణ సందర్భంగా పలు సలహాలు, సూచనలిచ్చారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలలో విద్యార్థులకు ప్రణాళికాయుతంగా బోధించి, ఉత్తమ ఫలితాలకు దోహదపడాలని సూచించారు. 294 మంది ఉపాధ్యాయులు శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ స్కీమ్స్ అండ్ పాలసీ ఏపీ లీడ్ సభ్యురాలు ఉషాకుమారి, జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ, స్టేట్ అబ్జర్వర్ చిరకాల శ్రీలత, కోర్సు డైరెక్టర్ వి.అప్పారావు, ప్రిన్సిపాల్ మార్తా తిలకం తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



గంగరాజు(ఫైల్)

మాకవరపాలెం: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణారావు సోమవారం మీడియాకు తెలిపారు. వివరాలు. మండలంలోని సుభద్రయ్యపాలెం గ్రామానికి చెందిన అత్తుమూరి గంగరాజు(53) తాళ్లపాలెం వద్దనున్న ఓ సిమెంట్ ఫ్యాక్టరీలో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 16 నుంచి ఆయన అదృశ్యమయ్యారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో సోమవారం పీపీ అగ్రహారం సమీపంలోని సరుగుడు తోటలో గంగరాజు మృతదేహం లభ్యమైంది. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్న ట్లు ఎస్ఐ వెల్లడించారు.

స్టార్టప్‌లకు ప్రొపెల్ పోటీలు

బీచ్ రోడ్డు: వినియోగదారుల ఉత్పత్తుల రంగంలో స్టార్టప్‌లకు చేయూతనిచ్చేందుకు గ్లోబల్ బిజినెస్ యాక్సిలరేటర్ ప్రొపెల్ నాలుగో సీజన్ పోటీలు ప్రారంభించినట్టు అమెజాన్ ఇండియా ప్రతినిధి భూపెన్ వాకంకర్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం ప్రొపెల్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఆసక్తి ఉన్న వారు http:// www.amazon.in/ prope వె బ్సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గతానికంటే మెరుగైన సీట్లతో మళ్లీ జగనన్న పాలన

- చోడవరంలో భారీ మెజార్టీతో ఘన విజయం సాధిస్తాం
- మండలాల వారీ సమీక్షలో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ



పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

చోడవరం: ఎవరు ఎన్ని కుయుక్తులు పన్నినా రాష్ట్రంలో గతం కన్నా మెరుగైన సీట్లతో మళ్లీ జగనన్న ప్రభుత్వం అధికారంలోకి రాబోతోందని, చోడవరంలో భారీ మెజార్టీతో గెలిచేది తానేనని ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని రోలుగుంట, రావికమతం, బుచ్చెయ్యపేట, చోడవరం మండలాల పార్టీ శ్రేణులతో విడివిడిగా సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాలు, గ్రామ పంచాయతీలోని పోలింగ్ కేంద్రాల వారీగా నమోదైన ఓట్లు, వైఎస్సార్‌సీపీకి వచ్చే ఓట్ల వివరాలు, మెజార్టీ గురించి కార్యకర్తలతో కూలంకషంగా సమీక్షించారు. అన్ని చోట్లా ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయని, దీంతో గెలుపు ఖాయమని పేర్కొన్నారు. ప్రతి మండలంలో మెజార్టీ కనిపిస్తున్న తరుణంలో పార్టీ శ్రేణుల్లో జోష్ కనిపిస్తోందన్నారు. అయితే కొన్ని దృష్ట శక్తులు పార్టీలోనే ఉంటూ పార్టీకి దెబ్బతీసేలా వ్యవహరించారని, అలాంటి వారికి రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెప్పక తప్పదన్నారు. పార్టీ కోసం నిరంతరం కష్టపడిన కార్యకర్తలకు, నాయకులకు భవిష్యత్తులో తగిన గుర్తింపు ఉంటుందని, వారందరికీ న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ ఆధిష్టానం కూడా ఈ విషయంలో ఒక నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. చోడవరంలో పార్టీ జెండా ఎగురవేసేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు. ఇదే ప్రోత్సాహం భవిష్యత్తులో కూడా ఉండాలని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. అయితే ఆశించిన రీతిలో వలంటీర్లు సహకరించలేదన్న విమర్శలు సమావేశంలో వ్యక్తం అయ్యాయి. సమావేశంలో నాలుగు మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మెడికల సాకారం

- జూలై నుంచి వైద్య విద్య ప్రారంభానికి చర్యలు
- త్వరలో ఎన్ఎంసీ పరిశీలన
- రూ.500 కోట్లతో పాడేరులో నిర్మాణం
- గిరిజనులకు ఉన్నత వైద్యం, వైద్య విద్య సీఎం జగన్ లక్ష్యం



నిర్మాణంలో మెడికల్ కళాశాలకు అనుబంధ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవనం

సాక్షి, పాడేరు: స్వాతంత్ర్యం సిద్ధించిన నాటి నుంచి గిరిజనులకు నాణ్యమైన వైద్యం అందని ద్రాక్షగానే మిగిలింది. గిరిజనులకు ఉన్నత వైద్యమంటే వందల కిలోమీటర్ల దూరంలో విశాఖ కేజీహెచ్‌యే దిక్కు. అక్కడకి అత్యవసర వైద్యానికి రోగులను తరలించేలోపు ప్రాణాలు గాలిలో కలిసిపోయిన విషాదకర సంఘటనలు అనేకం. గిరిజనుల పక్షపాతిగా పేరొందిన వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేత హోదాలో 2019 ఎన్నికల ప్రచారానికి పాడేరు వచ్చి మెడికల్ కళాశాల మంజూరు చేస్తామని, గిరిజనులకు ఉన్నత వైద్యంతోపాటు వైద్య విద్య అందుబాటులోకి తెస్తానని ప్రకటించారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పాడేరులో మెడికల్ కళాశాలకు 35 ఎకరాల స్థలం సేకరించడం, వెన్వెంటనే రూ.500 కోట్లు మంజూరు చేశారు.

చురుగ్గా మెడికల్ కళాశాల నిర్మాణ పనులు

పాడేరు పాలిటెక్నిక్ కళాశాల ప్రాంతంలో మూడు బ్లాక్‌లలో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. కరోనా మహమ్మారి కారణంగా ఏడాది పాటు మెడికల్ కళాశాల నిర్మాణ పనులకు జాప్యం జరిగింది. మరోవైపు ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకుని ఇక్కడ అన్ని విభాగాల సిబ్బంది మెడికల్ కళాశాల నిర్మాణ పనులను చేపడుతున్నారు. ప్రభుత్వం మరో ఏడాది గడువు పెంచడంతో ఈ ఏడాది చివరి నాటికి మెడికల్ కళాశాల నిర్మాణాన్ని పూర్తి చేసే లక్ష్యంతో ఎన్‌సీసీ నిర్మాణ సంస్థ పని చేస్తోంది.

జూలైలో మెడికల్ కళాశాల ప్రారంభం

ఇప్పటికే పాడేరులో వైద్య కళాశాలకు ప్రిన్సిపాల్‌తో పాటు 11 మంది ప్రొఫెసర్లు, 16 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 32 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ముగ్గురు సీనియర్ రెసిడెంట్ డాక్టర్లను నియమించారు. వారంతా పాడేరు జిల్లా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్నారు. తాత్కాలికంగా పాడేరు జిల్లా ఆస్పత్రిలో 420 బెడ్‌లను ఏర్పాటు చేసి గిరిజనులకు ఉన్నత వైద్య సేవలను అందిస్తున్నారు. అయితే జాతీయ మెడికల్ కౌన్సిల్ పరిశీలన పూర్తయిన వెంటనే వైద్య కళాశాలను కూడా ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించేందుకు తగిన ఏర్పాట్లను పూర్తి చేశారు.

క్లుప్తంగా

వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కశింకోట : కశింకోటలోని దేవదాయ శాఖకు చెందిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న స్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం వేద పారాయణ నిర్వహించారు. స్వామి వారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి సదస్య మహోత్సవం, పండిత గోష్ఠి నిర్వహించారు. ప్రసాద వితరణ చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, రేజేటి మారుతి పాల్గొన్నారు.

వరాహలక్ష్మీ నృసింహస్వామి జయంతికి ఏర్పాట్లు

అనకాపల్లి : స్థానిక గవరపాలెం దిబ్బవీధి శ్రీ వరహ లక్ష్మీనృసింహ స్వామి దేవాలయంలో ఈనెల 22న వైశాఖ శుద్ధ చతుర్థశి స్వాతి నక్షత్రం నరసింహ జయంతిని పురస్కరించుకుని స్వామివారికి పంచామృతం అభిషేకాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ నిర్వాహకులు మళ్ల రామచంద్రరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదేరోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ స్వామివారికి 1008 తులసి దళాలలో ప్రత్యేక పూజ జరుగుతుందన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగిందని పేర్కొన్నారు.

టంగుటూరికి ఘన నివాళులు

కశింకోట: మండలంలోని పల్లపు సోమవరం గ్రామంలో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన అందించిన సేవలను వక్తలు ప్రస్తుతించారు. మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు, పాల సంఘం అధ్యక్షుడు పప్పల అప్పారావు, పీఏస్ జెర్రిపోతుల నూకినాయుడు, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కూరగాయల ధరలు ఇలా..

కశింకోట : తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం టమాటా, బంగాళా దుంపల ధర పెరిగింది. కిలోకి రూ.10 వంతున పెరిగాయి. గత వారం కిలో టమాటా, బంగాళాదుంప రూ.30 ఉండగా, ఈ వారం కిలో రూ.40కి పెరిగింది. ఉల్లిపాయ రూ.30, బెండకాయ, వంకాయ, దొండకాయ, క్యాబేజి రూ.40, గోరు చిక్కుడు, బీరకాయ, బీట్రూట్, క్యారెట్, క్యాప్సికం, కాకరకాయ రూ.60కి విక్రయాలు సాగాయి.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 860 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,400	5,180
మొదటి రకం	4,400	5,210
రెండో రకం	3,930	4,320
మూడోరకం	3,400	3,900

అనకాపల్లి సినిమాలు

నటరత్నాలు	: రాజా
మిరల్	: సత్యనారాయణ స్క్రీన్-1
కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ద ఏప్స్	: సత్యనారాయణస్క్రీన్-2
బాక్	: షిర్డిసాయి
ఆ ఒక్కటీ అడక్కు	: పర్తిసాయి
అపరిచితుడు	: వెంకటేశ్వర
రత్నం	: శ్రీసత్య
కృష్ణమ్మ	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 99 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-13 యూనిట్లు, బీ పాజిటివ్-47 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-34 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 428 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 367 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.



వైఎస్సార్ జగనన్న లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణం



ఎస్సీ కాలనీలో నిర్మించిన మురుగు కాలువ

అభివృద్ధికి చిరునామా...అచ్చెర్ల

మండలంలోని అచ్చెర్ల గ్రామం అభివృద్ధికి చిరునామాగా మారింది. గతంలో ఎన్నడూలేని అభివృద్ధి జరిగింది. సుమారు రూ.65 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. నాడు-నేడులో ప్రాథమికోన్నత పాఠశాల, అంతర్గత సిమెంటు రోడ్లు, కాలువలు నిర్మించి అభివృద్ధి చేశారు. భారీగా జగనన్న కాలనీలో స్థలాలు ఇచ్చి ప్రభుత్వ ఆర్థిక సహాయం అందివ్వడంతో ఇళ్లు నిర్మించుకున్నారు.

అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణ ఖర్చు రూ.20 లక్షలు	నాడు-నేడులో ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధి వ్యయం రూ.18.50 లక్షలు
ఎస్సీ కాలనీలో మురుగు కాలువల నిర్మాణ వ్యయం రూ.5 లక్షలు	రైతు భరోసా కేంద్రం నిర్మాణ వ్యయం రూ.21 లక్షలు



పొలాలకు రైతుల ఉపయోగార్థం ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు

కశింకోట : అచ్చెర్ల గ్రామంలోని వైఎస్సార్ జగనన్న కాలనీకి చెందిన తుమ్మి లక్ష్మి ఉపాధి కూలీ. భర్త గంగరాజు తాపీ మేస్త్రి. కుమార్తె, కుమారుడు ఉన్నారు. వారికి సొంత ఇల్లు లేదు. పూరిపాకలో అద్దెకు నివాసం ఉండేవారు. జగనన్న కాలనీలో స్థలం, ఇల్లు ఇచ్చారు. గృహం నిర్మించుకున్నారు. 8 నెలల క్రితం గృహ ప్రవేశం చేసి నివాసం ఉంటున్నారు. సొంత ఇంటి కల నెరవేరినందుకు ఆనందంగా ఉందని లక్ష్మి తెలిపారు...ఇలా ఈ గ్రామంలో ప్రతి ఇంటికీ ఏదో లబ్ధి కలిగింది. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో ఈ ఐదేళ్లలో అచ్చెర్ల గ్రామం రూపురేఖలు మారాయి.

మండలంలోని మారుమూలన అచ్చెర్ల గ్రామ పంచాయతీ ఉంది. కొత్త అచ్చెర్ల, గమినిపేట శివారు గ్రామాలుగా ఉన్నాయి. వీటితోపాటు దీని పరిధిలో ఉన్న మోసయ్యపేట పంచాయతీ, శివారు గోకివానిపాలెం గ్రామాలను కలిపి సచివాలయం ఏర్పాటు చేశారు. దీంతో సచివాలయ ప్రధాన కేంద్రంగా ఏర్పడి కొనసాగుతోంది. సుమారు 3 వేలు జనాభా కలిగి ఉంది. గత ఐదేళ్లలో గ్రామంలో పలు అభివృద్ధి పనులు జరిగాయి. నాడు-నేడులో రూ.18.50 లక్షలతో ప్రాథమికోన్నత పాఠశాలను మరమ్మతులు చేపట్టి ఆవరణలో మొక్కలు నాటి అందంగా అభివృద్ధి చేశారు. రూ.20 లక్షల ఉపాధి పథకం నిధులతో రెండు అంతర్గత సిమెంట్ రోడ్లు నిర్మించారు. రైతులకు ఉపయోగపడే విధంగా పొలాలకు వెళ్లడానికి అనువుగా మట్టి రోడ్డును ఏర్పాటు చేశారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ కాలనీలో సిమెంట్ మురుగు కాలువలు నిర్మించారు. వైఎస్సార్ లే-అవుట్ ఏర్పాటు చేసి 60 మందికి స్థలాలు, ఇళ్లు మంజూరు చేశారు. వాటిలో సుమారు 25 ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలినవి లబ్ధిదారులు నిర్మించుకుంటున్నారు. సుమారు 20 మంది వరకు గృహ ప్రవేశాలు చేసి నివాసం ఉంటున్నారు. సొంతింటి కల నెరవేరినందుకు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో వినియోగంలోకి తేకుండా వదిలేసిన నీటి పథకాన్ని రంగులు వేసి ప్రారంభించి తాగునీటిని అందించారు. రూ.21 లక్షలతో రైతు భరోసా కేంద్ర భవనాన్ని నిర్మాణం చేపట్టారు. తుది దశకు చేరుకుంది. ఇలా అభివృద్ధి జరగడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



నాడు-నేడులో అందంగా అభివృద్ధి చేసిన ప్రాథమికోన్నత పాఠశాల

రోడ్లు బాగుపడ్డాయి



జగనన్న ప్రభుత్వంలో మా గ్రామంలో అంతర్గత సిమెంట్ రోడ్లు నిర్మించి అభివృద్ధి చేశారు. వర్షం వచ్చిందంటే గతంలో రాకపోకలకు ఇబ్బంది పడేవారం. ఇప్పుడు ఇబ్బందులు తొలిగాయి. ఎంతో ఆనందంగా ఉంది.

–పెదపాటి పార్వతమ్మ, అచ్చెర్ల

డ్రైనేజీలు నిర్మించారు



ఎస్సీ కాలనీలో సిమెంట్ మురుగు కాలువలు నిర్మించారు. దీంతో మురుగునీరు దిగువకు పోతోంది. కాలువ లేనప్పుడు నీరు ఇక్కడే నిల్వ ఉండి దుర్వాసనతో ఇబ్బంది పడేవారం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

–పిల్లి సునీత, అచ్చెర్ల

గజ్జాలమ్మ ఉత్సవానికి సన్నాహాలు



కన్నూరుపాలెంలో వెలసిన గజ్జాలమ్మ వారు



గజ్జాలమ్మ ఆలయం



ఆలయ అలంకరణకు సిద్ధం చేస్తున్న పూలమాలలు

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెం గ్రామంలో ప్రసిద్ధి చెందిన గజ్జాలమ్మ ఉత్సవం మంగళవారం పెద్ద ఎత్తున నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. రెండేళ్లకొకమారు ఇక్కడ అమ్మ వారి ఉత్సవాన్ని నిర్వహించడం అనవాయితీ. ఉత్సవం సందర్భంగా ఆలయాన్ని అందంగా పూలదండలతో అలంకరిస్తామని, అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయని, సాయంత్రం జాతర ఊరేగింపు జరుగుతుందని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. అమ్మ వారి ఆలయం నుంచి గ్రామంలోని సాయిబాబా ఆలయం వరకు విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు. ఎన్నికల నిబంధనల దృష్ట్యా సాంస్కృతిక కార్యక్రమాలు ఈసారి ఏర్పాటు చేయలేదన్నారు.

ముమ్మరంగా వేసవి దుక్కులు



కట్టుబోలు సమీపంలో ట్రాక్టర్‌తో దుక్కి చేస్తున్న దృశ్యం

రాంబిల్లి: మండలంలో వేసవి దుక్కులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ట్రాక్టర్ల సాయంతో వేసవి దుక్కులు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నారుమడులు కోసం దుక్కి చేస్తున్నారు. దీంతో పాటు పచ్చిరొట్ట ఎరువులు వేసేందుకు కూడా దుక్కి పనులు చేస్తున్నారు. ప్రభుత్వం జీలుగ, జనుము, పిల్లిపెసర (పచ్చిరొట్ట) విత్తనాలను 50 శాతం రాయితీ రైతులకు అందజేయనున్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



ఎన్టీఆర్ కాలనీలో ప్రజలకు సూచనలిస్తున్న హోంగార్డు



పట్టణంలో ప్రజలకు సూచనలిస్తున్న పోలీసు సిబ్బంది

యలమంచిలి రూరల్ : ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో గ్రామాల్లో అల్లర్లు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని యలమంచిలి పట్టణ ఎస్ఐ పాపినాయుడు హెచ్చరించారు. సోమవారం ఆయన పట్టణంలో ప్రధాన వీధుల్లో తిరిగి స్థానిక ప్రజలతో మాట్లాడారు. రాష్ట్రంలో కొన్ని చోట్ల ఎన్నికల అనంతరం హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో ప్రజలంతా సంయమనంతో ఉండాలని, ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని సూచించారు. ఆ తర్వాత పట్టణ పోలీస్ స్టేషన్ సిబ్బంది రాంనగర్, ఏఎస్ఆర్, ఎన్టీఆర్, ఫైర్ ఆఫీస్ కాలనీలు, పాతవీధి, కాకివాని వీధి, ధర్మవరం, ఎర్రవరం, కొత్తపాలెం తదితర గ్రామాల్లో హోంగార్డులు విస్తృతంగా పర్యటించి ప్రజలకు లౌడ్ స్పీకర్‌తో సూచనలిచ్చారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఎలాంటి సంబరాలు, ఊరేగింపులకు అనుమతి లేదని, 144 సెక్షన్ అమలులో ఉన్నందున నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని, శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలంతా పోలీసులకు సహకరించాలని పోలీసు సిబ్బంది కోరారు.

వర్మీకంపోస్టుపై దృష్టి సారించండి



పీఎల్ పురం గ్రామంలో వర్మి కంపోస్టును పరిశీలిస్తున్న ఈవోఆర్డీ

పాయకరావుపేట : గ్రామ కార్యదర్శులు వర్మీకంపోస్టు తయారు, అభివృద్ధిపై దృష్టి సారించాలని ఈవోఆర్డీ సిహెచ్.చంద్రశేఖర్ అన్నారు. చెత్త నుండి సంపద కేంద్రాలను అభివృద్ధి చేయాలన్నారు. మండలంలో గల పీఎల్ పురం, నామవరం గ్రామాలను సోమవారం పర్యటించి గ్రామ కార్యదర్శులకు తగు సూచనలు, సలహాలు అందించారు. వర్మి కంపోస్టు తయారుపై పంచాయితీ సిబ్బంది దృష్టి సారించాలన్నారు. అదే విధంగా గ్రామాల్లో పారిశుధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈవోఆర్డీతో పాటు గ్రామ కార్యదర్శి బీవీబీఎల్ మూర్తి ఉన్నారు.

పలు గ్రామాల్లో భారీ వర్షం



తాళ్లపాలెం కూడలిలో పడుతున్న వర్షం



తాళ్లపాలెం సంత వద్ద వర్షపు నీటితో మునిగిన నర్సీపట్నం వైపు రోడ్డు



తాళ్లపాలెం సంతలో నీరు చేరిన దృశ్యం



కన్నూరుపాలెంలో పల్లపు ప్రాంతంలో చేరిన వర్షపు నీరు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం, కన్నూరుపాలెం ప్రాంతాల్లో సోమవారం పెద్ద వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు నీటితో నిండాయి. మొదట తాళ్లపాలెం ప్రాంతంలో అకస్మాత్తుగా మేఘాలు కమ్ముకొని ఒక్కసారి పెద్ద వర్షం కురిసింది. అర్థ గంట పాటు కురిసిన వర్షం వల్ల తాళ్లపాలెం కూడలిలో నీరు చేరింది. అక్కడి వారపు సంత వద్ద నర్సీపట్నం వైపు రోడ్డులో నీరు చేరింది. రాకపోకలకు వాహన చోదకులు, పాదచారులు ఇబ్బంది సంతలో కూరగాయల దుకాణాల పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. దీంతో కూరగాయలు కొనుగోలుకు వచ్చిన ప్రజలు ఇబ్బంది చెందారు. ఇక్కడ తర్వాత కన్నూరుపాలెం ప్రాంతంలో గాలులు వీచి పెద్ద పెద్ద వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు నీటిమయం అయి ప్రజలు ఇబ్బంది చెందారు. గాలుల వల్ల విద్యుత్ సరఫరాకు వర్షం పడినంతసేపు అంతరాయం కలిగింది. అయితే వాతావరణం చల్లబడి వేసవి తాపంతో ఇబ్బంది పడుతున్న ప్రజలు ఉపశమనం పొందారు. కశింకోట ప్రాంతంలో ఆకాశం మేఘావృతమై ఉన్నప్పటికీ వర్షం కురవలేదు.

విద్యార్థులకు భగవద్గీత పై అవగాహన



విద్యార్థులకు పాఠ్యాంశాలను వివరిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు సీతారామమూర్తి

పాయకరావుపేట : ప్రతి విద్యార్థి పాఠ్యాంశాలతో పాటు పురాణేతిహాసాలపై కూడా అవగాహన కలిగి ఉండాలని విశ్రాంత ఉపాధ్యాయులు ఎస్.సీతారామమూర్తి అన్నారు. వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా గ్రంథాలయంలో విద్యార్థులకు భగవద్గీత, రామాయణాలపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి పాఠ్యాంశాలతో పాటు పురాణాలు, భగవద్గీత, రామాయణం వంటి గ్రంథాలను కూడా పఠించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఇంగ్లిష్ బోధన పైన, వందేమాతరం గేయం పైన అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి పుస్తక పఠనం చేయాలన్నారు. విద్యతో పాటు విద్యార్థులకు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని తెలిపారు.

జిల్లా కేంద్రంగా కుస్తీ క్రీడను అభివృద్ధి చేస్తా..



ఎం.వి.మాణిక్యాలరావును శాలువాతో సత్కరిస్తున్న క్రీడాకారులు

అనకాపల్లి : జిల్లాలో ఆసక్తి గల క్రీడాకారులకు రెజ్లింగ్(కుస్తీ) పోటీల్లో పాల్గొనేందుకు త్వరలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని అమెచ్యూర్ రెజ్లింగ్(ఒలింపిక్ వెయిట్ లిఫ్టర్) అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.మాణిక్యాలరావు అన్నారు. స్థానిక గవరపాలెం వి.వి.రమణ రైతు భారతిహాల్లో సోమవారం జిల్లా క్రీడాకారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంగా త్వరలో కుస్తీ పోటీల అసోసియేషన్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వాలు క్రీడాకారులకు ఎంతో ప్రోత్సహం అందిస్తుందని, విద్యార్థి దశ నుంచి క్రీడలపై ఆసక్తి పెంచుకునేలా దశల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు ఆళ్ల ప్రవీష్ కుమార్, శిలపరశెట్టి బాబి, దొడ్డి సంతోష్, ఎన్.హేమసాయి, గణేష్, హృదయ్, ప్రవల్లిక, సత్యనారాయణ పాల్గొన్నారు.

చిత్ర కళా పోటీలతో సృజనాత్మకత



చిత్రలేఖన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో ఎంఈవో-1 చిట్టిబాబు



హాజరైన విద్యార్థులు

అనకాపల్లి: చిత్ర కళా పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, భావవ్యక్తీకరణ వెల్లివిరుస్తుందని తద్వారా ప్రతిభకు గుర్తింపు లభిస్తుందని మండల విద్యాశాఖాధికారి-1 కె.చిట్టిబాబు పేర్కొన్నారు. స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో 15 రోజులుగా జరుగుతున్న ఉచిత చిత్ర లేఖనం శిక్షణ తరగతులు సోమవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నతనం నుంచి విద్యార్థులకు చిత్రకళలో మెళకువలు శిక్షణ శిబిరంలో నేర్పించడం అభినందనీయమన్నారు. చిత్రకారులు రాజా రవివర్మ, వడ్డాది పాపయ్య, అంట్యాకుల పైడిరాజుల గురించి చిన్నారులు తెలుసుకోవాలని ఆయన సూచించారు. బాల్య దశ నుంచి చిత్రలేఖనం అవవరచుకోవడానికి వీలుగా ప్రభుత్వ విద్యా సంస్థలు సేవలందిస్తున్నాయన్నారు. చిత్రలేఖనం కొందరికి అభిరుచి అని, అందమైన బొమ్మను చూస్తున్నప్పుడు కలిగే అనుభూతి వేయి వీణల సంగీతంతో సమానమని చెప్పారు. ప్రస్తుత కాలంలో పిల్లలు చదువుతో పాటు ఇతర అభిరుచులపైనా దృష్టి పెట్టాలన్నారు. ఆటలు, నృత్యాలు, కళలపై ఇష్టం పెంచుకోవాలన్నారు. శిక్షణ అనంతరం సీనియర్, జూనియర్ విభాగంలో ఉత్తమ చిత్రాలను గీచిన విద్యార్థులను సర్టిఫికెట్లతో అభినందించారు. గౌరీ గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు, డ్రాయింగ్ సీనియర్ ఉపాధ్యాయుడు బొడ్డేడ సూర్యనారాయణ, గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకులు కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్, సభ్యులు కాండ్రేగుల సత్యనారాయణ, బొడ్డేడ జగ్గఅప్పారావు, పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదువుకోవాలి



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో అల్లాడ సౌజన్య, బల్లా నాగభూషణం

అనకాపల్లి : విద్యార్థి దశ నుంచి కష్టపడి చదవడం కంటే ఇష్టపడి చదవడంతో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని గాజువాక టీఎస్ఆర్, టీబీకె కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ అల్లాడ సౌజన్య అన్నారు. స్థానిక చిన్నరాజుపేట సిద్దార్థా సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 8 మంది విద్యార్థినీ విద్యార్థులకు నగదు ప్రోత్సాహం, సర్టిఫికెట్లు సోమవారం అందజేశారు. విద్యార్థులు సెలవులను వృథా చేయకుండా పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం, సభ్యులు వినకోట నీలేష్‌గుప్తా, రొబ్బి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

గోవాలమ్మతల్లి పండగ నేడు



మునగపాక: మండల కేంద్రమైన మునగపాకలో మంగళవారం గోవాలమ్మ తల్లి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రతి అయిదేళ్లకు ఒకసారి నిర్వహించే పండగను ఈ సారి కూడా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు సంఘ అధ్యక్షుడు బొడ్డేడ అప్పలనాయుడు తెలిపారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకోవాలని కోరారు.